అవిఘ్నమస్తు శుభమస్తు




# శ్రీ పాదవల్లభుల చరిత్ర

**(పద్య గద్య కృతి)**


**రచన**

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

**M.Tech.**




## ప్రార్థన

కం॥ శ్రీపాదవల్లభేంద్రులు
నాపై కరుణించి యీయ నాకు సుకీర్తిన్
ఈపద్య గద్య చరితము
ఆపకనే జెప్పువాడనా గురుకృపచే.

## శ్రీపాదవల్లభ స్వామి

అనాదిగా శ్రీమన్నారాయణుడు అవతారముల నెత్తి దుష్ట శిక్షణ చేసి శిష్ట రక్షణగా విస్తూనే ఉన్నాడు. దత్తాత్రేయ స్వామిగా ఆయన దివ్యజ్ఞాన బోధ చేశాడు. కలియుగం ఆదత్తాత్రేయస్వామి గోదావరీతీరమున నున్న గంధర్వపురానికి సమీపమున నున్న పిఠాపురంలో అప్పలరాజు శర్మ అను బ్రాహ్మణుడు సుమతి అనే సౌశీల్యవతని పెండ్లాడి ఆపస్తంభ సూత్రుడై దత్త భక్తుడై జీవించేవాడు. వారికి సంతానం కలిగినా ఇద్దరు తప్ప అందరూ మరణించాడరు. విధివశాత్తు ఆ



ఇద్దరుకూడా ఒకడు కంటివాడు ఇంకొకడు గ్రుడ్డివాడు. వారింటికి వెరు భిక్షకు వచ్చినా వారు దత్తాత్రేయ స్వామి అవతారంగా భావించి భిక్ష వేసేవారు. ఏనాడైె నా స్వామి దర్శనభాగ్యం కలుగుతుందని వారి నమ్మకం.

ఆ రోజు శర్మగారింట్లో వారినాన్న గారి ఆబ్దీకం. బ్రాహ్మణులు ఇంకా భోజనాలకు కూర్చొనలేదు. ఇంతలో ఒక యోగి వారికింటికి మిట్ట మధ్యాహ్నం వేళవచ్చి "భవతీభిక్షాందేహి!" అన్నాడు. ఏమి జరుగుతుందో తెలిసే లోపలే శర్మగారి ఇల్లాలు సుమతి ఆయోగిని లోనికి ఆహ్వానించి భక్తితో భిక్షవేసింది.

బ్రాహ్మణులంతా ఆగ్రహంతో చిందులు తొక్కారు. ఆమెని నిందిస్తూలేచి పోయారు. ఆమె లెక్కచేయలేదు. ఆయోగి ఆమెకనులకు శ్రాద్ధ భోక్త పరమేశ్వరుడుగా ఆమె మనో దృష్టికి స్ఫురించాడు. ఆయన తన ఇలవేల్పు శ్రీ దత్తాత్రేయుని వలెతోచి ఆమె చేతులు జోడించింది.



చిరునవ్వుతో ఆమె ఎదుట ఆయోగి దత్తాత్రేయునివలె ప్రత్యక్షమై సాధ్వీ **నీకేంవరం కావాలో కోరుకోమన్నారు.** ఆమె డగ్గుత్తికతో ఇలా అన్నది.

**ఆ॥ ఒక్క కొడుకు గుడ్డి, ఒక్కడు కుంటాయె**
**పాపమేమొకాని బాధమిగిలె**
**వంశమెల్ల వెలుగు పావనంబై స్వామి!**
**కడుపుపండ నాకు కొడుకు వగుము.**

దత్తాత్రేయస్వామి ఆనందంగా అంగీకరించాడు. శర్మ ఆనందానికి అవధుల్లేవు. భార్యతో పాటు స్వామిని వేనోళ్ళ స్తుతించాడు.

తదనంతరం ఆమె గర్భవతియై పది నెలలకి పండంటి కొడుకును కన్నది. దివ్యతేజో విరాజితుడైన ఆ బిడ్డకు శ్రీపాదవల్లభుడని నామకరణంచేశారు. ఆ బాలుడు పుట్టిన తిథి ఉదయించిన విఘ్ననాయకుడు పార్వతీనందనుడు భాద్రపద శుద్ధ చవితి. అత్రిమహర్షికి ప్రాప్తించిన భాగ్యం తనుకు కలిగినందుకు, ఆ దంపతుల ఆనందానికి అవధుల్లేవు.

కలియుగంలో దత్తాత్రేయస్వామి తొలి అవతారానికి తము కారణం కావటం అదృష్టమని వారు ఉప్పొంగిపోయారు.

ముద్దు ముచ్చట్లతో కాలం శరవేగంగా పరిగెత్తుతున్నది. శ్రీపాదుడు గోదావరీ తీరాన్నే పవిత్ర చేస్తూ పెరిగి ఎనిమిదేండ్ల వాడైనాడు. తల్లిదండ్రులు ఒక శుభముహూర్తాన పిల్లవానికి యధా విధిని ఉపనయన మహోత్సవం జరిపించారు. గాయత్రీ మంత్రోఛ్ఛారణతోనే శ్రీపాదునికి వేదములు ఇదివరకే వల్లెవేసిన వానివలె గంగాప్రవాహంలో ముఖతః పెల్లుబికాయి. గురువులేకుండా వేదములన్నింటినీ చదివే అతను గురుదత్తుడనటంలో సందేహమేముంది. అన్యులకిది అసాధ్యం కదా!.

శ్రీపాదుడు పదహారేండ్ల వాడయినాడు. కుమారునికి వివాహం చేయాలని సంకల్పించి శర్మగారు కన్యాన్వేషణ చేద్దామని శ్రీపాదుని అభిప్రాయమడిగారు. అతను నవ్వుతూ **యోగశ్రీ అను చిన్నారిని నాకు కట్టబెట్టండి తండ్రీ!** అన్నాడు. తలిదండ్రులకు ఆమాట అర్థంకాలేదు. శ్రీపాదుడిలా అన్నాడు.



**తండ్రీ! నేను శ్రీవల్లభుడను. నాకు సంతానం వల్ల కలిగే ముక్తి ఏముంటుంది? ఇకపోతే నావలన తమరి పితృదేవతలతో సహా మీయందరికీ పుణ్యాలోకాలు లభిసస్తాయి. నేను నిత్యముక్తుడను. ప్రపంచానికి జ్ఞానబోధ నా జన్మలక్ష్యం అన్నాడు.**

తమ దత్తాత్రేయుని కోరిన సంగతి గుర్తుకు వచ్చినా జీవభ్రాంతి తొలగని సుమతి **నాయనా! నీవు సన్యసిస్తే అవిటివారైన నీ సోదరుల గతి ఏమిటి? వృద్ధాప్యంలో మాకు తోడెవరుంటారు. మా వంశం నిర్వంశమైపోవలసిందేనా** అనివిలపించింది.

రాజు తలచుకుంటే దెబ్బలకి కొదలా! అన్నట్లు వరప్రదాత పూనుకుంటే కానిదేముంది? సోదరుల అవిటితనం రెప్పపాటులో మాయమవుతుంది. తల్లిదండ్రుల అజ్ఞానం తెరలా తొలిగిపోయింది. కన్నీటితో వారిలా అన్నారు.



**ఉ॥ వల్లభ! నీదుమాయ యిది, భ్రాంతిలి నారము**
**ముద్దులొల్కుమా**
**పిల్లడి వంచు నమ్మితిమి పెంచిన మోహము**
**వీడమైతిమే!**
**చల్లని నీదు మాట విని స్వాంతన మందితి**
**మయ్య ఓ ప్రభు!**
**ఎల్లలు లేని నీకరుణ ఈప్సిత మీయును**
**మానవాళికిన్.**

**సర్వేశ్వరుణ్ణే పూజించాలే కానీ దాచుకుని స్వార్థానికి ఉపయోగించు కోవాలనుకోవటం అవివేకం. మమ్ము క్షమించి అన్నారు.**

తక్షణం సన్యసించిన శ్రీపాదవల్లభుడు తలిదండ్రులకు కోరినప్పుడు తన సాయుజ్యం ప్రసాదించి, సోదరులను ప్రయోజకులను చేసి తలిదండ్రుల బాధ్యత నొప్పగించి పాదచారియై ద్వారక, బదరీ, బృందావనం, కాశీ క్షేత్రాలు దర్శించి గోకర్ణ క్షేత్రంచేరాడు. అక్కడ మహాబలేశ్వరునిగా



లింగరూపియై సాక్షాత్తూ శివుడే నెలకొని యున్నాడు. ఆ లింగాన్ని ప్రతిష్టించింది సాక్షాత్తూ, శివపుత్రుడు గణపతి దేవుడే. శివుని ఆత్మలింగమని ప్రసిద్ధి చెందిన ఆ స్వామిని చూచి పులకించని భక్తులుండరు.

గోకర్ణ క్షేత్రప్రాశస్త్యం తెలియచెబుతూ త్రేతాయుగం నాటి ఒక కథ ప్రసిద్ధి నొందింది. రావణాసురుని తల్లి కైకసి గొప్ప శివభక్తురాలు. ఆమె సముద్రతీరంలో నిత్యమూ సైకతలింగం (ఇసుకతో చేసినలింగం) చేసి శివుని ఆరాధించేది. ఆమె ఒకనాడు అలా చేస్తున్నప్పుడు ఒక పెద్ద అలవచ్చి లింగాన్ని రూపుమాపింది. పూజకి అంతరాయం కలిగిందని ఆమె విలపించసాగింది.

అదిచూసి ఆగ్రహించిన రావణుడు కైలాసపర్వతాన్నే పెకలించి లంకలో ప్రతిష్ఠాపన చేస్తానని శివస్థానాన్నే పెకలించబోయాడు. భీతిల్లిన అపర్ణ(పార్వతి)ని చూసి సదాశివుడు చిద్విలాసంగా నవ్వి కాలి బొటన వేలితో కైలాస పర్వతాన్ని తొక్కాడు. ఆపర్వతం క్రింద కాళ్ళు ఇరుక్కుపోయి

బాధపడుతున్న రావణుడు తన పొట్టను చీల్చి ప్రేవులనే తంత్రులుగా చేసి పరమేశ్వరునికి ఇష్టమైన సామగానం చేశాడు.

అంతలో కినుక, అంతలోనే కరుణ గల ఆ భోళా శంకరుడు రావణుని మన్నించి యధా రూపమిచ్చి **ఏవరం కావాలో కోరుకో నీవీకైలాసగిరి నెందుకు పెకలించావు** అన్నాడు. జరిగిన సంగతి చెప్పి శివభక్తురాలైన తన తల్లి కోసం ఆపని చేశానని, శివుని ఆత్మలింగమిస్తే ఆమె కోరిక తీరుస్తానన్నాడు దశకంఠుడు.

శివుడు తన ఆత్మలింగం ఇచ్చేసి దానిని నేలపై ఉంచిన మరుక్షణం భూమిలో స్థాపితమైపోతుందని హెచ్చరించి మరీ ఇచ్చాడు. ఆత్మలింగం లంకలో ప్రతిష్ఠింపబడితే లంకను జయించటం అసాధ్యమని విష్ణువుతో మొరపెట్టుకున్నారు దేవతలు. శ్రీహరి నవ్వి నారదునితో కాగలకార్యం గణపతే చేస్తాడన్నాడు.

వెంటనే నారదుడు మనోవేగంతో వినాయకుని ముందు వ్రాలి **స్వామీ ఆ రావణుని గర్వంచూశారా........**



కం॥ **తొలి పూజ నీకుసేయుడు**
**తలపడు గణనాధుడంచు దానవపతియున్**
**విలువను ఈయడు శివునకు**
**తులువకు గర్వంబు నీవు ద్రుంచగ సరియౌ**

అన్నాడు.

సూర్యాస్తమయమవుతున్నది. సంధ్యావార్చవలె. చేతిలో శివుని ఆత్మలింగముండి పోయింది. దానిని క్రిందపెట్టరాదు. ఎలా అని విచారిస్తున్న రావణుని ఎదుట గొల్లపిల్లవాడివలె ప్రత్యక్షమయ్యాడు గణపతి. ఆ లింగాన్ని కాసేపు పట్టుకుంటే కోరింది ఇస్తానన్నాడు రావణుడు.

**నాకేం కావాలయ్యా ఉండ్రాళ్ళు పెట్టు చాలు** అన్నాడు బాలుడు. అయినా గుర్తించలేదా దనుజుడు. ఆత్మలింగాన్ని బాలునికిచ్చి సాగర తీరంలో సంధ్య వారుస్తున్నాడు. ఉండ్రాళ్ళు వాగ్దానంతో తృప్తి చెందిన గణపతిని హెచ్చరించాడు నారదుడు.



**“రావణా! చెయ్యినొప్పిగా ఉంది ఇక పట్టుకోలేను. రా వచ్చి ఈ లింగాన్ని తీసుకో** అన్నాడు బాలుడు ఇదిగో వచ్చేస్తున్నా క్రిందపెట్టకు అని అరుస్తూ పరిగెత్తుకొని వస్తున్నాడు దనుజుడు. నారదుడు కూడా పరిగెత్తుకొనివస్తూ కనిపించాడు. **నాయనా ఆ లింగాన్ని క్రిందపెట్టకు నా చేతికియ్యి** అని అరుస్తున్నట్లు కనిపించాడు.

చటుక్కున ఆత్మలింగాన్ని నేలపై ఉంచాడు బాల గణపతి. క్షణంలో శిలాకారం దాల్చింది ఆత్మలింగం. కోపంపట్టలేక నాలుగు తగిలించాడు రావణుడు. బాలుడు పెద్దగా రోదించాడు. నారదుడు రావణుని అనునయిస్తూ ఇలా అన్నాడు.

చం॥ **తలచిన దొక్కటైనయెడ ధాత్రిమరొక్కటి యౌను ఏరికిన్**
**తెలియని వింత అయ్యెదియె దీనికి చింతిల రాదు రావణా!**



**‘నలువ వరప్రసాదివి’, వినాయకు గొల్వక ఇంత లాయె పో**
**అలుగకు బాలకుండితడు ఆరడిబెట్టుట నీకు భావ్యమా?**

చేసేది లేక నిరాశతో వెనుతిరిగాడు దశాననుడు. రెండు దెబ్బలు తిన్నా మానవాళిని రక్షించాడు విఘ్నేశుడు. రావణుడి ప్రయత్నాల వల్ల ఆ లింగం ఆవు యొక్క చెవ్వులాగ ఒకపక్క డొల్లగా ఉండి గోకర్ణం అని పిలవబడింది. అక్కడ శివుడు సపరివారంగా విహరిస్తుంటాడు. దేవ, దానవ, నర, మృగ జాతులన్నిటిచే కొలువబడే ఆ లింగం కైలాసగిరినే కదిల్చిన రావణునికే లొంగని దవుటచే మహాబలేశ్వరుడని పేరుగాంచాడు.

పూర్వం మిత్రసహాడనే ఇక్ష్వాకు వంశస్థుడైన రాజు ఉండేవాడు. ధర్మస్వరూపుడై ప్రజారంజకంగా పరిపాలించే ఆరాజు ఎంతో కీర్తిసంపాదించాడు. ఒక రోజు క్రూర జంతువులను వేటాడుటకు అడవికెళ్ళిన ఆయనకు ఒక రాక్షసుడు ఎదురై రాజు యొక్క బాణము వలన మరణించాడు.

ఆరాక్షసుడి సోదరుడు నేరుగా ఎదిరించే శక్తిలేక కపటంతో పగతీర్చుకోవాలని ఆయన సేవకుడిగా నరుని రూపంలో సేవించ సాగాడు.

ఒక నాడు ఆరాజు తన తండ్రిగారిశ్రాద్ధకర్మకు భోక్తగా వసిష్ఠమహర్షి నాహ్వానించాడు. వంట బ్రాహ్మణునిగా వున్న రాక్షసుడు ఆయనకు వంటకాలతో పాటు నరమాంసం కూడా రహస్యంగా వడ్డించాడు. అదిచూసి ముని ఆగ్రహోదగ్రుడై నిషిద్ధాహారం వడ్డించి నన్ను అపవిత్రుని చేసిన నీవు బ్రహ్మరాక్షసుడివై పొమ్మని శపించాడు. తన తండ్రి శ్రార్థం చెడుట చేత అసలే ఆవేదనతో నున్న రాజు, ముని శాపానికి ఆక్రోశించి తిరిగి శపించ బోయాడు. రాజు భార్య వారించి శ్రాద్ధకర్మనాడు బ్రాహ్మణుని నిందించరాదని వారించింది. శపించబోయి ఆగిపోయిన మిత్రసహుడు శాపజలాన్ని తన పాదములపైననే పడవేసుకున్నాడు. తద్వార కల్మషపాదుడనే బ్రహ్మరాక్షసుడైనాడు.



రాజపత్ని ఔదార్యం చూసి ముగ్ధుడైన ముని అమ్మా పన్నెండు సంవత్సరాల తరువాత నీభర్త శాపవిముక్తుడవుతాడని అనుగ్రహించాడు. అప్పటి నుండి కల్మషపాదుడు తనవెంటనే బ్రహ్మరాక్షసత్వం ఛాయలా ఉండగా మృగ, నరమాంస భక్షణతో జీవించాడు. ఒక రోజు ఆకలికి తాళలేక ఒక బ్రాహ్మణుని చంపితిన్నాడు. భర్తని కోల్పోయి బ్రాహ్మణి ఆవేదనతో...

**ఆ॥ శాపదష్టుడయ్యు పాపంబు మానవు**
**నాదు పతిని జంపినావు నీచ!**
**సతిని గవయు క్షణము చంపును నినుకూడ**
**'ఎదురుచూపె' మిగులు నీదు సతికి**

అని శపించింది. పన్నెండేళ్ళ తర్వాత తిరిగి పూర్వరూపం వచ్చినా భార్యకు దూరమైన రాజు భార్య వెంట తీర్థ యాత్రలు చేస్తూ గౌతమ మహర్షి ఆశ్రమం చేరి దీనంగా ప్రార్థించాడు. కరుణాంతరంగుడైన ముని, రాజుకు గోకర్ణక్షేత్ర మహిమ నెరింగించుతూ **"రాజా! పూర్వం 'సౌదామిని' అను బ్రాహ్మణ స్త్రీ వైధవ్యంతో జీవిస్తూ దురాచారియై, జారిణియై**



**ఒక వైశ్యునితో అక్రమ సంబంధం పెట్టుకున్నది. ప్రజలంతా ఆమెని వెలివేసినా నిర్లజ్జగానే జీవించింది. మద్యపానానికి కూడా అలవాటు పడింది.**

**కల్లుత్రాగిన మైకంలో ఆకలికి మేకమాంసం తిందామనుకుని పొరపాటున మత్తులో మేక అనుకొని ఒక ఆవుదూడను చంపింది. ప్రియునికి విందు చేసింది. మరునాడు వంటింట్లో ఆవుదూడ తలచూచి విషణ్ణయై దుఃఖించి మరణించింది. నరకంలో ఎన్ని శిక్షలను భవించినా ఆమె పాపంతీరలేదు పాపశేషంవల్ల ఒక ఛండాలినిగా జన్మించింది. అనేక బాధలనుభవించింది. పుట్టు గుడ్డియైన ఆమె తల్లిదండ్రులకి కూడా భారమై బ్రతుకు మరీ, దుర్భరమై పోయింది. శివాలయంలో యాచిస్తూ గడిపింది.**

**ఒక శివరాత్రినాడు ఆమెకు తినటానికి ఏమీ దొరక్క నిరాహారయై గడిపింది. కొందరు భక్తులు ఆమెని వట్టి చేతులతో పంపలేక మారేడు దళాలు ఆమెచేతిలో ఉంచారు. నిరాశానిస్పృహలతో ఆమెవాటిని శివలింగంపైనే విసిరేసింది.**



**నిరాసక్తితోనే శివ నామస్మరణ విన్నది. స్పృహ కోల్పోయి మరణించింది. గోకర్ణ క్షేత్రంలో ఆ విధంగా మరణించిన ఆమె శివగణాలచేత కైలాసం తీసుకు పోబడింది.**

**కనుక ఓ మహారాజా! నీవుకూడ గోకర్ణ క్షేత్రం దర్శించి బ్రాహ్మణ శాపంనుంచి విముక్తుడవై, నీ భార్యతోను, సంతానంతోను సుఖంగా వుంటావు** అని గౌతమ మహర్షి ఆగోకర్ణక్షేత్రమహిమను వివరించాడు.

గోకర్ణక్షేత్రం కాశీప్రయాగలంత పవిత్ర పుణ్యక్షేత్రం. ఆక్షేత్ర దర్శనము చేతమాత్రమె గాక ఆమహిమను మననం చేసినాపుణ్యాం లభిస్తుంది. ఇంద్రాది దేవతలు కూడా ఇక్కడకు వచ్చి మహాబలేశ్వరుని అర్చిస్తుంటారు. మానవులూ, దానవలూ కూడా ఆస్వామిని సేవించి ఈప్సితాలు పొందుతుంటారు. విశ్వదేవతలు, మరుత్తులూ, వసూవులూ ఆయనను పూజిస్తారు. దిక్పాలకులకు కశ్యపాదిమునులకు సిద్ధ, సాధ్య, గంధర్వులకు ఈ గోకర్ణం గొప్ప పుణ్యస్థలం. అందుచేతనే

కం॥ శ్రీపాదవల్లభుం, డట
కాపాడుచు భక్తకోటి కామితములనే
చేపట్టి తీర్చుచుండెను.
ఆపై మూడేండ్లపాటు అతడు వసించెన్

తరువాత కృష్ణా నదీతీరానగల కురవపురం వెళ్ళి అక్కడ తమ స్థూల రూపాన్ని మరుగు పరచారు.

దత్తాత్రేయస్వామి అవతారమూర్తిగా జన్మించిన శ్రీపాదవల్లభునికి తన గతజన్మ జ్ఞానమే గాక రాబోవు జన్మల జ్ఞానం వుండటంలో ఆశ్చర్యమేముంది? మందమతిని మహాజ్ఞానిని చేయగల దివ్యశక్తి ఉండటంలో సందేహమేల?

శ్రీపాదవల్లభులు గోకర్ణక్షేత్రంలో మూడేండ్లు గడిపి తరువాత శ్రీశైలం వెళ్ళారు. అక్కడ నాల్గు నెలలుండి ఎందరో శివభక్తులను అనుగ్రహించారు. అక్కడినుండి నివృత్తి సంగమానికి వెళ్ళారు. అక్కడ స్నానమాచరించి కురువపురం వెళ్ళారు. కృష్ణ మరియు వేణి అను రెండు నదులసంగమం కురువపురం (నేడు అది కురుగడ్డి అనిపిలువ బడుతున్నది).



అది ఎంతో పవిత్రమైన సంగమం. భగవదవతారమైన శ్రీపాద స్వామి అక్కడ స్థిర నివాసంగాయుండుట చేత ఆక్షేత్రం జగద్విఖ్యాతమయింది. శ్రీపాదులను భక్తిశ్రద్ధలతో కొంచిన వారికి ఈప్సితములన్నీ నెరవేరుతుంటాయి. అక్కడ శ్రీపాదవల్లభులు మరొక అవతారం ఎత్తినా, గుప్తరూపంలో నేటికీ సంచరిస్తూ భక్తుల మనోభీష్టం నెరవేరుస్తుంటారని ప్రతీతి.

శ్రీపాదవల్లభులు భగవదవతారులై కూడ నిత్యం జపంచేస్తూ నదీస్నానం ఎందుకు చేసేవారని కొందరి సందేహం. పవిత్ర నదుల్లో సజ్జనులే కాక దుర్మార్గులూ, అపవిత్రులూ స్నానంచేస్తారు. పశుపక్ష్యాదులు నీరుత్రాగి ఎంగిలిచేస్తాయి. అందువల్ల ఆ నదీమతల్లి అపవిత్రమై లోకులకి పుణ్యం ప్రసాదించే శక్తి కోలుపోతుంది. అప్పుడు శ్రీపాదుల వంటి భగవత్స్వరూపులు ఆపాపం తము గ్రహించి ఆనదుల్ని తిరిగిపునీతం చేస్తారు. తముకూడా జపతపాది కార్యక్రమములు చేసి తమకంటిన అపవిత్రత పోగొట్టుకుంటారు.



అందుకనే పవిత్ర నదులలో స్నానం చేస్తూ ఉమ్మివేయుట, మలమూత్రవిసర్జన చేయుట పాపకార్యమని గ్రహించవలెను.

ఇక శ్రీపాదులవారి భక్త వాత్సల్యం ఒక చక్కని కథద్వారా తెలుసుకోవచ్చు. పూర్వం కురువపురంలో వేదవిద్యా దురంధరుడు సద్బ్రాహ్మణునికి అంబిక అనే సౌశీల్యవతియైన భార్య ఉండేది. ఆమె గొప్పపతివ్రత. ఆమె సంతానవతి అయికూడా కొద్ది కాలంలోనే వారు చనిపోవుట చేత ఎంతో దుఃఖించింది. ఆతరువాత ఆమె భర్తతో కలసి ఎన్నో తీర్థయాత్రలు చేసింది. ఎట్టకేలకు ఆమె నోములు ఫలించి ఒక మగబిడ్డను ప్రసవించింది.

కాని ఆబాలుడు మందమతి అయ్యాడు. లేకలేక కలిగిన బిడ్డ గనుక గారబంగా పెరిగాడు. ఎనిమిదవ ఏట ఉపనయనం చేసి గురువున కొప్పగించాక అసలు సంగతి బయటపడింది. వానికి ఒక్కవేదమంత్రం కూడ నోటికి రాలేదు. **'పండితపుత్రః శుంఠ'** అని తోటి వారు ఎగతాళి చేస్తుంటే



ఆతండ్రి తాళలేక పోయాడు. చింత బెత్తంతో వీపు వాచేట్లు కొట్టాడు. ఫలితం శూన్యం బాధతో పెడబొబ్బలు పెడుతున్న పుత్రుని జూచి తల్లి తట్టుకోలేక పోయింది. రోదిస్తూ భర్తతో ఇలా అన్నది.

**మ॥ తగునే! యివ్విధి మందబుద్ధి గల ఈ దౌర్భాగ్యు**
**దండించగా**
**పగవాడా? మన బిడ్డ గాదె? మిగిలెన్**
**బాలుండు తానొక్కడై**
**సగమైపోతిరి చింతతోటి, వెతలన్ చాలించి**
**ప్రాప్తంబిదే**
**అగునంచున్ మది సంతసంబు కలుగన్**
**ఆనందమున్ పంచుడీ**

**'నాథా! మీరు కొట్టి వీడిని చంపినంత మాత్రాన మనకి పుత్రశోకం తప్ప మిగిలేదేమిటి. వాని పురాకృత కర్మవల్ల మందమతి అయ్యాడు. ఇందువాని దోష మేముంది?** అన్నది.

ఆ బ్రాహ్మణుడు కూడ ఆలోచించి విద్యాదానం చేయని వాడు (పరులకు విద్య నేర్పించుట, విద్యలేని వారు పరులకు విద్య చెప్పించుట, పాఠశాలలు కట్టించుట వంటి ధర్మ కార్యములు శక్తిమేరకు చేయవలెను) మరుజన్మలో విద్య నేర్వడు. చూపులకు జందెపు బ్రాహ్మణునిగా మిగిలిపోయే వ్యర్థుడు అని చింతించి కొంతకాలానికి ఆ దిగులుతోనే మరణించాడు.

తోటివారు ఆ బాలుని తండ్రిమరణానికి కారణమైన పుత్రునిగా నిందించారు. **తల్లి ముష్టి ఎత్తి తిండి పెడుతుంటే తిని కూర్చునే నీ బ్రతుకు చెడ, ఆ వ్యర్థం పండితుడి ఆత్మకు కూడా శాంతి కలుగదే నీ బ్రతకు చెడ అని తూలనాడారు.** మానసికంగా క్రుంగి పోయిన ఆ కుర్రవాడు ఇంట్లోంచి పారిపోయి ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. దానికి ఏం చేయాలో తెలియని అమాయకుడతడు. ఏంచేయాలో కూడా ఆ నిందించే 'పెద్దలే' చెప్పేవారు. ఉరిపోసుకు చావరాదురా అని ఒకాయన అడిగితే, బావిలోదూకరాదూ అని ఒకడనే వాడు. మంటలో పడు అని ఒక పెద్దమనిషి అంటే, పచ్చ



గన్నెరుకాయలు తిని చావరాదా అని ఒకడు తిట్టేవాడు. అదెట్లా చేయాలో కూడా తెలియని అమాయకుడతను. జాలిలేని లోకం నింద భరించలేక ఆ కుర్రవాడు తీవ్రంగా చనిపోవాలని నిశ్చయించుకున్నాడు. తండ్రినుంచి సంక్రమించిన దత్తాత్రేయునిపై భక్తివలన ఇలా రోదించాడు.

**కం॥ 'ఉరి' బోసుకొనుట మేలా?**
**పరుగిడి 'కృష్ణమ్మ' లోన పడుటయు మేలా?**
**దురుసుగ దూకన 'మంట' ను**
**సరియని 'గన్నేరు' మ్రింగి చావన దత్తా!**

చివరికి కృష్ణలో దూకి చనిపోదామని పరుగిడుతున్న ఆ కుర్రవాని తల్లి కూడా అతని వెంట పరిగెత్తి ఆత్మహత్య చేసుకుందామనుకుంది. అప్పుడు ఒకదివ్య పురుషుడు వారి కెదురుపడ్డాడు భగవంతుని అవతారంగా కనిపిస్తున్న ఆతేజోమూర్తియే శ్రీపాదవల్లభులు. ఆయన ఇలా అన్నారు.

"నాయనా! తొందరపడుట తగని పని. పూర్వజన్మ కర్మ పరిపక్వం కానంతవరకు మనిషి యాతనలనుభవించక



**తప్పదు. నీ ఈ ఆత్మహత్య నీవు చేసిన పాపాల చిట్టాలో మరియొక పాపం పెంచుతుందే తప్ప నీకేం మేలు కలుగుతుంది? నిన్ను చూచి నీచావు భరించలేక నీతల్లి కూడా ఆత్మహత్య చేసుకుంటుంది. ఆత్మహత్యా పాతకంతో పాటు బ్రాహ్మణిని చంపిన పాపం తల్లిని చంపిన పాపాలు కూడా చుట్టుకుంటాయి. వేరొక నీచ జన్మలో ఆపాపం అనుభవించడం తప్ప ప్రయోజన మేమిటి? కష్టాలు సహించి నీ కర్మనంతం చేసుకోవటం మంచిది కదా!**

ఆ దివ్యబోధ ఆ పిల్లవాని తలకెక్కింది కాని తల్లిమాత్రం మందుమతి వీడు ఎప్పుడేంచేస్తాడో తెలియదు. ఈ అనిశ్చిత బ్రతుకు కంటే మరణమే మేలని ఆయనకి నమస్కరించి **"స్వామీ! భర్తలేని అనాథను, కొడుకు అసమర్థుడు, దాయాదులు దయాహీనులు, నామహాపాపమే దీని కారణమని నన్ను పాపిగానెంచి ఊరి వారు నన్ను పలుకరించరు. ఇక జీవించి లాభమేమి'** అన్నది.



దానికి ఆమెతో శ్రీపాదులిలా అన్నారు. **"తల్లీ! నీకు తిరిగి ఆత్మహత్య తగని పని అని వివరించనవసరంలేదు. నీశేష జీవితం శివపూజలో గడుపు నీకర్మత్వరగా కరిగిపోతుంది. నీకు మనోధైర్యం కలుగుటకు ఈ కథవిను!**

**పూర్వం ఉజ్జయినీ నగరాన్ని చంద్రసేన మహారాజు ప్రజారంజకంగా పరిపాలించేవాడు. అతనికి మణిభద్రుడనే సన్మిత్రుడుండేవాడు. ఇద్దరూ మంచి శివభక్తులు. పరమశివుని అచంచల విశ్వాసంతో త్రికరణ శుద్ధిగా పూజించేవారు. వారి భక్తికి మెచ్చి శంకరుడు వారికి 'చింతామణి' అనే దివ్యమణి లభ్యమవునట్లు చేశాడు. కోరిన కోర్కెలు తీర్చగల శక్తిగల ఆమణిని వారు నిత్యమూ భక్తిశ్రద్ధలతో పూజించారు. కాని ఏనాడు ఏదీ దానినుంచి కోరలేదు.**

**వారికి చింతామణి లభించిందని ఈర్ష్య చెందిన కొందరు పొరుగు రాజులు చంద్రసేనుని పై దండెత్తి ఆ మణిని సంగ్రహించాలని పన్నాగం పన్నారు. రాజ్యంపై దండెత్తాలని పథకంవేశారు. ఇదిట్లా ఉండగా రామనామంజపిస్తే నాస్తికుడైనా**

ఆస్తికుడు అవుతాడన్నట్లు ఆస్నేహితుల భక్తి ప్రపత్తుల ఫలితంగా రాజ్యంలోని పామరులైన గొల్లవారు కూడా గొడ్లు కాయటం మానేసి శివనామ సంకీర్తన చేయటం మొదలు పెట్టారు. ప్రతి గృహంలోనూ ఒక శివలింగం ప్రతిష్ఠింపబడింది. భక్తి మహిమ అదే.

తే॥ నాడు, ప్రహ్లాదుతోడైన బుడుతలెల్ల
అసురులై కూడ హరినామ అమృతఝురిని
ఓలలాడిరి అన్యంబు తెలియరైరి.
భక్తి, ఒరులకు తోచును పైత్యమట్లు.

ఒక రోజు చీకటి పడ్డాక ఎవరిండ్లకు వారు పోయినా ఒక బాలుడు మాత్రం పరమ శివునిపై ఏకాగ్ర చిత్తం నిలిపి పరమేశ్వరుని ధ్యానిస్తూ ఉండిపోయాడు.

అతని భక్తికి కడుంగడు సంతసించిన ముక్కంటి నవరత్న ఖచిత శివలింగాన్ని వానికి బహూకరించాడు. ఆ బాలుని తల్లికి అరుదైన గొప్ప వరం ప్రదానం చేశాడు. తల్లీ! నీవు శ్రీమన్నారాయణమూర్తికే స్తన్యమిచ్చి లాలించి



గారాబుచేసి పెంచే భాగ్యం పొందుతావు. నీవు యశోదా దేవిగా శ్రీకృష్ణుడైన శ్రీహరికి స్తన్యమిస్తావు, అన్నాడు.

శంకరుని కరుణ కలిగిన ఆబాలుని గాథవిని శత్రురాజులలో పశ్చాత్తాపము కలిగి తమ అపరాథం మన్నించమని చంద్రసేన మహారాజును వేడుకున్నారు.

అంతేకాక తమ రాజ్యంలో కూడ గోసంరక్షణాధిపత్యం ఆ బాలునికే ఒప్పగించారు. ఇదంతా ఆబాలురు చేసిన 'శని ప్రదోషవ్రత' ప్రభావమే. శ్రీపాదవల్లభులు చెప్పిన ఈ కథవిని అంబిక శ్రీపాదవల్లభస్వామికి నమస్కరించి వినమ్రురాలై దీనంగా ఇలా అన్నది. "స్వామి శివపూజవలన నాకు ఫలితం వచ్చే జన్మకు కదా లభించేది. ఈ జీవితశేషం నేనెలా గడపగలను. ఈ నాబిడ్డడు మానసికరోగి. ఎప్పుడు ఆత్మహత్య చేసుకుంటాడో తెలియదు. నేను పుత్రశోకం భరించలేను. దానికన్నా ఆత్మహత్యా పాపం అనుభవించటమే మంచిదేమో.

ఎన్నో దివ్య మహిమలు గల తమరే నన్ను రక్షించాలి" అన్నది. హృదతయం కరిగిపోయిన ఆ దయాసముద్రుడు



ఆబాలుని శిరస్సుపై తన అమృత హస్తం యుంచి ఇలా అన్నారు.

కం॥ తల్లిని మించిన దైవము
ముల్లోకములందులేదు, ముందుగ నీకే
చెల్లింతు నేను శుభములు
వల్లభుడన్ నమ్మునాదు పలుకులనమ్మా!

అప్పుడు ఆ బాలుని ఆశీర్వదించి ఓంకారము నుచ్చరించారు.

తక్షణం ఆ మందమతి బృహస్పతి వంటి జ్ఞాని అయ్యాడు. ఇప్పుడు వాని ముఖకమలం దివ్యతేజస్సుతో ప్రకాశిస్తున్నది. అతనికి తల్లిని మించిన దైవం లేదని భోదించి శ్రీపాదవల్లభులు 'అమ్మా ఇకనైనా నీదుఃఖాన్ని విడచి శివార్చనలో నీశేషజీవితం గడుపు. వచ్చే జన్మలో నీకు నా అంతటి సుపుత్రుడు కలుగుతాడు', అని ఆశీర్వదించారు. ఆమె ఆనంద భరితురాల్లై పుత్రుని అండయి తన శేషజీవితం తన ఊరిలోనే గడిపింది. శివదీక్షాపరులయ్యింది.



ఆ విధంగా కృష్ణానదీతీరాన కురువపురంలో నెలకొనిన శ్రీపాద సరస్వతి స్వామి దత్తాత్రేయావతారమనటానికి ఎన్నో నిదర్శనలు చూపారు. కృష్ణా నదిలో అను నిత్యం స్నానం చేసి ఆ నదికి గంగకున్నంత పవిత్రతని చేకూర్చారు. మరి భగవత్స్వరూపులైన శ్రీపాదులకు గంగాస్నానం వలన మాత్రం ఒనగూడే పుణ్యం ఏపాటిది అని కొందరి అభిమతం.

నిజమే ఆ స్నానాలవల్ల స్వామివారికి కలిగే పుణ్యం ఏముండదు. కానీ మహాకవి కాళిదాసు త్రాగాడని శిష్యులంతా కల్లు త్రాగినట్లు గురువుగారి దీక్ష నిష్ఠల ననుకరించని శిష్యులు కూడా, గురువేదన్నా లోపం చేస్తే తముకూడా తక్కువతిన్నామా అని అదేలోపం చేస్తారు.

ఆ॥ చేనులోన ఆవు చేరి మేసినయంత
పూని దూడ గట్టుపైన తినునె?
నిష్ఠలేని'గురుని' నిందించి శిష్యులున్
చెడుదురందు చేత చెడును జగతి.

అందుకనే గురువులు నిష్ఠతో జపతపాదులు చేస్తారు. ఆ గ్రామమున ఒక రజకుడు నివసించుచుండెను. ఒక దినమున అతడు కృష్ణా నదిలో బట్టలు ఉతుకుటకేగెను. అదే సమయమున స్నానము చేయుటకు శ్రీపాదవల్లభస్వామి, నదికేతెంచుచుండిరి. వారిదివ్య మంగళ విగ్రహమును చూచిన రజకుడు ఎవరో దేవతను చూచినట్లు ఆశ్చర్యానందాలతో రెప్పవాల్చక చూచాడు. తనకు తెలియకుండానే అతడు స్వామికి సాష్టాంగ పడి వందనం చేశాడు. శిరస్సు నాడించి స్వామి ముందుకు సాగిపోయినారు. ఆరాత్రివానికి కంటిపై కునుకు లేదు. కనులు తెరచినా, కనులు మూసినా శ్రీపాదులే కనబడుతున్నారు. అనిర్వచనీయమైన ఆనందంలో వాడు తన్మయుడయ్యాడు.

ఆ తరువాత ప్రతిరోజు శ్రీపాదుల కనబడగానే సాష్టాంగపడటం వాని దిన చర్య అయ్యింది.

ఒక రోజు స్వామి ఉన్నట్లుండి **"నాయనా! నిత్యమూ నాకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నావు నీకు నాపై ఇంత శ్రద్ధా**



**భక్తులెలా కలిగాయి. ఏదేమైనా నీ భక్తికి ఆనందించాను"** అన్నారు.

ఉబ్బితబ్బిబ్బై వాడు ప్రతిదినం ఇదివరకటి కంటే ఎక్కువైన శ్రద్ధాసక్తులతో సేవించాడు. దాని వల్ల అతనికి ఉన్నట్లుండి ప్రపంచాసక్తి నశించి, వైరాగ్యం కలిగింది. స్వామి ఆశ్రమ ప్రాంగణమంతా ఊడ్చి, అలికి ముగ్గులు పెట్టి ఆ తరువాతే తనకులవృత్తి చేసుకునేవాడు.

ఇంతలో వైశాఖ మాసం వచ్చింది. వసంత శోభతో ఆ గ్రామం నవవధువులా అందాలు చిందించింది.

ఒక రోజు స్వామి నవ్వుతూ రజకునితో "నాయనా! నీకు రాజయోగమున్నది. రాజువై జన్మించి రాజ్యం ఏలుతావు" అన్నారు.

నిజానికి ఆమాటలు వాడికి అర్థం కాకపోయినా స్వామి తనకి మంచి జరుగుతుందని అంటున్నారని అర్థమై సంతోషపడ్డాడు. ఒక రోజు వాడు గుడ్డలు ఉతకటానికి నదికి వెళుతుంటే సుందరీమణులతో జలక్రీడలాడుతున్న ఒక



యవన రాజు కనిపించాడు. వారితో సరసోక్తులతో నదీ విహారం చేస్తున్నాడు ఆరాజు.

**చం॥తొలకరి జల్లు వోలె యొక తొయ్యలిపై జలకంబు చిమ్ముచున్**
**గలగల నవ్వు భూలలనకాంతుడు, ఇంకొక దాని వెన్కక**
**న్నులు తను మూసి ఆపడతి నోటికి ఓష్ఠము నందజేయు ఆ**
**వలపుల రేని వైభవ మవాక్కయి చాకలి చూచి మ్రాన్పడెన్.**

ఆరాజు పరివారం, సైనిక పరిచారకులు మొదలైన ఆర్భాటం చూచి సమ్మోహితుడై తన్మయుడై ఆ జలక్రీడల దృశ్యాన్ని చూస్తుండిపోయాడు. ఆప్రయత్నంగానే వాడు ఇటువంటి వైభవం అనుభవించని జన్మఒక జన్మేనా? ఈరాజు ఎంత అదృష్టవంతుడు ఇట్టి అదృష్టం కలుగుటకు అతనికి



శ్రీపాదుల వంటి గురుకృప మెండుగా కలిగి ఉండాలి. నా బోటి హీన జన్మునికి ఆ వైభవం కలలోని మాట గదా అనకున్నాడు.

కొంతసేపటికి యవన రాజు తనపరివారం తీసుకుని తమ ప్రయాణం కొనసాగించాడు. రజకుడి ఆలోచనల కంతు లేకపోయింది. అట్టి సుఖముననుభవించని జన్మవల్ల లాభమేమి? మరి వల్లభస్వామి వలె పవిత్ర జీవితం గడిపే వారి మాటేమిటి? వారే ప్రయోజనాన్ని ఆశించి ఆ విరాగి జీవితం గడుపుతున్నారు?

ఇంతలో శ్రీపాదస్వామి అక్కడకు స్నానం చేయుటకొచ్చారు. అన్యమనస్కంగా ప్రణమిల్లిన రజకుని చూచి నవ్వుతూ ఇలా అన్నారు. **"నాయనా! సుఖాలు అశాశ్వతమైనవే కానీ వాటి మీద ఒక్కసారి వ్యామోహం కలిగితే మానసిక జపం ద్వారా ఆత్మప్రక్షాళన చేసుకోవాలి. లేకపోతే ఆ కోరిక తీరే దాక జీవుడు జన్మిస్తూనే ఉంటాడు. 'జడ భరతుని' వంటి విరాగులకే ఆ గతి తప్పలేదు మరి నీవెంత.**

**నీకోరిక నేను నీకు సిద్ధింప చేసినా ప్రయోజన మేమి? దృఢమైన శరీరంలేని వాడు ఏ శారీరక సౌఖ్యమూ అనుభవించ లేడు. జీవితమంతా కష్టంచేసి బ్రతికిన నీలోని మనస్సు సుఖానుభవం కోరుతోంది. ఇప్పుడు నీకు కలిగే ఈ కోరికలు తమోగుణం వల్ల వృద్ధి చెంది నీకు మనశ్శాంతి లేకుండా చేస్తాయి. అందుచేత ఈ సుఖాలు నీకు ఇప్పుడే అనుభవించాలని ఉన్నదా లేక మరుజన్మలో అనుభవిస్తావా"** అని అడిగారు. అప్పుడా రజకుడు 'స్వామీ! నా అజ్ఞానం మన్నించి మీరే నాకేది తగినదో నిర్ణయించి అది చేయండి. ఏది మంచిదో కూడా తెలియని అల్పుడను' అన్నాడు. అప్పుడు శ్రీపాదస్వామి **"నాయనా విచారించకు గురువుని నమ్మిన వారికి ఎన్నటికీ చెడు జరుగదు. నీవు మరుజన్మలో 'మృధుర' దేశంలో యవన రాజుగా జన్మిస్తావు** అన్నారు. (మృధుర రూపాంతరం చెంది నేటి విదర్భ అయిందని కొందరు, అదే బీదర్ అని కొందరు అభిప్రాయపడుతున్నారు) దానికా రజకుడు ఇలా అన్నాడు.



**ఆ॥ సమ్మతంబె నాకు స్వామి మీ వరమిది**
**మతసహనము నిమ్ము మరియు నాకు**
**రాజ్య భోగమందు లావౌ విరక్తియున్**
**పరమ భక్తి నిమ్ము 'గురుని' మీద.**

**దానికి స్వామి నాయనా! నేను కూడా వేరొక జన్మ ఎత్త వలసి ఉంది. అప్పుడు "నేను నృసింహ సరస్వతిగా అవతరిస్తాను. నీవు ఇప్పుడా యవన రాజు అనుభవించిన దాని కంటే గొప్ప సుఖం అనుభవిస్తావు. నీకు వృద్ధాప్యంలోనే మా దర్శనమవుతుంది. తక్షణం నీకు జ్ఞానోదయమై నాదారికి వస్తావు. భయపడకు. కర్మబంధం నిన్ను కట్టిపడవేయదు",** అని విచిత్రంగా నవ్వారు.

మరుక్షణమే రజకుడు విరిగిన మ్రానులా నేలకొరిగాడు. ఆ వెంటనే మరణించాడు. ఆ విధంగా కురువపురంలో శ్రీపాదవల్లభులు ఎన్నో లీలలు ప్రదర్శించారు.

ఇంతకు మునుపు అంబిక అను భక్తురాలిని. శివపూజా ఫలంగా మరుజన్మలో నావంటి పుత్రుడు నీకు పుడతాడని శ్రీవల్లభులు ఆశీర్వదించినట్లు తెలిసింది గదా! ఆమాట



నిలబెట్టుకోవటానికి ఒక ఆశ్వయుజ మాసం కృష్ణపక్షంలోని ద్వాదశి నాడు హస్తానక్షత్రమున శ్రీపాదవల్లభస్వామి కృష్ణా నదిలో మునిగి అంతర్ధానమై అవతారం చాలించారు.

అయినప్పటికి సూక్ష్మరూపంలో కురువపురంలోనే ఉన్నారని తెలిపే నిదర్శనాలు కోకొల్లలున్నాయి. అందుకే కురువపురం నేటికీ సుప్రసిద్ధ శ్రీపాద గురుక్షేత్రం అయింది. శిష్యుల అజ్ఞానాంధకారం తొలగించే గురువులు చాలమంది ఉంటారు. కానీ వారి మనోభీష్టము నెరిగి వారి కామితములిచ్చే గురువులు మాత్రం తక్కువే. వారిలో శ్రీపాదవల్లభులు ఆద్యులు.

శ్రీపాదవల్లభులు శారీరకంగా జీవించి యుండనప్పటికీ తనను నమ్మిన భక్తులకు సశరీరంగా ఎన్నో అద్భుత దర్శనముల నిచ్చారు. ఇటువంటి నిదర్శనాలు లెక్కకు మిక్కుటంగా ఉన్నందున వాటి నన్నిటినీ ఉదహరించటం అసాధ్యము.

మానవుడు నేటికే కాదు మరెన్నటికైనా అర్థం చేసుకోలేని మహిమ పునరుజ్జీవం మాత్రమే. పూర్వం ఒక వూళ్లో కౌండిన్యసగోత్రుడైన ఒక బ్రాహ్మణుడుండేవాడు.



అతని పేరు వల్లభేశ్వరుడు. తెలివితేటన్న అతను బహు చతురుడు అయినందు వల్ల వ్యాపారంలో దిట్ట అని పేరుపొందాడు. పైగా దైవభక్తుడేమో, ఆతడు పట్టిందల్లా బంగారమయింది. అతను ఇంకొక కొత్త వ్యాపారం మొదలుపెట్టి శ్రీపాదవల్లభుని స్మరించి అందులో కూడ విశేషలాభములు వస్తె, కురువపురం దర్శించి వేయిమంది బ్రాహ్మణులకు సంతర్పణ అట్టహాసంగా చేయిస్తానని మ్రొక్కుకున్నాడు. అతనికి శ్రీపాదస్వామి దయవల్ల క్రొత్త వ్యాపారంలో కూడా ఇబ్బడి ముబ్బడిగా లాభాలొచ్చాయి.

**శా॥ పట్టిందంతయు బంగరాయె, ధనముల్ వద్దన్ననూ వచ్చెబో**
**పెట్టిందెల్లయు ఇబ్బడాయె, నగరిన్ పేరొందె శ్రేష్ఠుండయెన్**
**ముట్టిందంతయు మూడురెట్లు పెరిగెన్ మోదంబులున్ సంపదల్**
**చుట్టంబుల్ హితులెల్ల గూడిరొక్కటై సొంపార కీర్తించుచున్.**

చివరికి ఒక రోజు అతను కృతనిశ్చయుడై తగినంత పైకం తీసుకుని కురవపురం బయలు దేరాడు కొంతదూరం పోయే సరికి అతని కొకవ్యక్తి తారస పడ్డాడు. అతనూ కురువపురమే పోతున్నాడని తెలిసికొని ఇద్దరూ మాటలు కలిపి కలిసి ప్రయాణించసాగారు. వారి మాటలవల్ల ధనికునిలా కనిపిస్తున్న అతనిపేరు వల్లభేశ్వరుడని ఊహించిన ముగ్గురు దారిపోటు దొంగలు వారిద్దరినీ కలిసి వినయంగా అభివందనంచేశారు. వారిలో ఒకడు వల్లభేశ్వరునితో **'అయ్యా! తమరు నన్నెరుగరు కానీ నేను సుప్రసిద్ధమైన తమరి నామధేయమునెన్నోసార్లు విన్నాను. మీ పరిచయ భాగ్యం కలుగలేదు. కురువపురం యాత్రకి మేము ముగ్గురం వ్యాపారస్తులం బయలుదేరాము. మాకు తోడుంటారని సజ్జనులైన మీ స్నేహం కాంక్షిస్తున్నాం. మీకు అభ్యంతరం లేకపోతే కలిసి పయనిద్దాం** అన్నారు. పరమానందంతో సరే అన్నాడు, వల్లభేశ్వరుడు.

కొంత దూరం పోయాక ఒక నిర్జన ప్రదేశం వచ్చింది.



ఆ ముగ్గురూ కత్తులు దూసి వారిపై బడ్డారు. ఈ ఇద్దరూ గజగజ వణికిపోతున్నారు. దొంగల్లో ఇద్దరు వల్లభేశ్వరుని పెడరెక్కలు విరిచిపట్టుకున్నారు. మూడవవాడు తన విచ్చుకత్తి తీసి వల్లభేశ్వరుని తల ఖండించాడు. అయితే అంతకు ముందు కంపించి పోతున్న వల్లభేశ్వరుడు చివరి క్షణంలో **'ఓ శ్రీపాదవల్లభా! పాహిమాం'** అని పెద్దగా అరిచాడు.

అతని తలతెగిన మరుక్షణమే ప్రళయ కాలరుద్రుని రూపంలో శ్రీపాదస్వామి ప్రత్యక్షమై తన త్రిశూలంతో ఆ ముగ్గురు దొంగల తలలు నరికివేశాడు. ఆ మిగిలిన యువకుని వైపు ఆయన తిరగంగానే అతను **స్వామీ! శరణు శరణు నేను దొంగను కాను. హంతకుణ్ణి అంతకన్నాకాదు. మీరు లేకపోతే నాతలకూడా ఈ పాటికి తెగిపడి ఉండేది. నన్ను కాపాడండి** అన్నాడు.

శాంతించిన శ్రీపాదులు తన శాంతస్వరూపం దాల్చి "సరే! భయపడకు. శరణిస్తున్నాను. అయితే నీవొక పని చేయాలి ధైర్యం చిక్కబట్టుకో ఈ విభూతి తీసుకో. కొంత రాసుకో.



**ఆ తరువాత ఆ మొండానికి అతని తలన అతికించి భయ పడకుండా పట్టుకొని** ఉండు అని చెప్పి ఆ వల్లభేశ్వరునిపై విభూతిని చల్లమని చెప్పారు. అతనిలో కదలిక రాగానే నీవు వానికి తోడుండు అని ఆ యువకునికి చెప్పినస్వామి అదృశ్యమైనారు. పునర్జీవితుడైన వల్లభేశ్వరునికి జరిగినదేమి గుర్తులేదు. **మీరెవరు? చనిపోయిన ఈ ముగ్గురెవరు** అని ఆ యువకుణ్ణి భయకంపితుడై అడిగాడు.

అప్పుడా అపరిచితుడిలా అన్నాడు.

**ఉ॥ దోపిడి చేయవచ్చిరిటు దొంగలు మిమ్ముల నమ్మబల్కుచున్**
**మాపటి వేళ జంపి మిము మాయము అయ్యెడి దుష్టయోచనన్**
**ఓపిక తోటి మీసరస నొద్దిక జేరిరి మిమ్ము జంపగా**
**కోపము జెంది వల్లభులు కూళుల పీకల నుత్తరించె తాన్**

శ్రీపాదవల్లభులు ప్రళయ కాలరుద్రుడై దుష్ట శిక్షణ



**శిష్ట రక్షణ జేశారు. శరణన్న నాకు వారి దివ్యదర్శనం చేయుటమే గాక తెగిన మీ తలను తిరిగి నాచేత అతికింప జేసి మీకు ప్రాణం పోశారు,** అన్నాడు.

ఇక ఆయోగీశ్వరుడు భక్తుడైన తనకు కనబడక దొంగలతో చేరిన వానిని కరుణించి వానికి దర్శనమిచ్చారని కాసేపు విచారించినా, ఎవ్వరి కర్మఫలప్రకారం వారికి సద్గతులూ దుర్గతులూ కలుగుతాయి, కదా!

స్వామి భక్తుడు ఘోరమరణం చెందాడు, దొంగ అని అనుమానింప బడినవాడు వల్లభుని దర్శనం పొందుటయేగాక శ్రీపాదునికి సహాయకుడు కూడా అయ్యాడు.

తరువాత వల్లభేశ్వరుడు వెయ్యిమందికి కాక నాలుగు వేల మంది బ్రాహ్మణులకు సంతర్పణజేసి తృప్తి దీరా దక్షిణలిచ్చి సంతోషంతో సత్కరించాడు. ఈ ప్రకారంగా శ్రీపాదవల్లభులు కురువపురంలో దివ్యాత్మరూపంలో ఎంతో మంది భక్తులకు ఇటువంటి లీలలు ఎన్నెన్నో చూపారు. నేటికీ సజ్జనులు వారిని శ్రీపాదవల్లభునిగా దర్శించ గలుగుతున్నారు.